సాక్షి
విశాఖపట్నం

సోమవారం । 3 । జులై । 2023



బడుల్లో డిజిటల్ వెలుగులు

సర్కారు బడుల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్, స్మార్ట్ టీవీల ద్వారా పాఠ్యాంశాల బోధనకు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. 8లో



రాయితీపై టమాటా!

ప్రభుత్వం రైతుబజార్లలో టమాటాలను కిలో రూ.50 లకు అందిస్తోంది. ఇందుకోసం 16 టన్నుల టమాటాలను రప్పించింది. 8లో



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని సోమవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు.

న్యూస్‌రీల్

నేడు అప్పన్నకు తుది విడత చందనం సమర్పణ



చందనంలో సుగంధ ద్రవ్యాలు కలుపుతున్న అర్చకులు

సింహాచలం: ఆషాడ పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం తెల్లవారుజామున శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి తుది విడత చందనం సమర్పణ జరగనుంది. ఈ మేరకు ఇప్పటికే సిద్ధం చేసిన మూడు మణుగుల పచ్చిచందనంలో పలు రకాల సుగంధద్రవ్యాలను అర్చకులు ఆదివారం కలిపారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కౌంటీ సీసీ విజేత



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న ఏసీఏ ఎపెక్స్ కౌన్సిల్స్ కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథ్‌రెడ్డి

విశాఖ స్పోర్ట్స్: జేబీఆర్ స్మారక టీ–20 ఫైనల్‌లో కౌంటీ సీసీ 48 పరుగుల తేడాతో ఉషోదయ జట్టుపై విజయం సాధించింది. వైఎస్సార్ స్టేడియంలో ఆదివారం కౌంటీ సీసీ 8 వికెట్లు కోల్పోయి 149 పరుగుల చేయగా ఉషోదయ 101 పరుగులకే ఆలౌటైంది. ఈ టోర్నీలో బెస్ట్ బ్యాటర్, ఫైనల్‌లో బెస్ట్‌గా కె.హరీష్ నిలిచాడు. బెస్ట్ బౌలర్‌గా సిహెచ్.శివ, బెస్ట్ ఆల్‌రౌండర్‌గా ఎం.విజయ్‌కుమార్ నిలిచాడు. పోటీల ముగింపు కార్యక్రమానికి ఏసీఏ ఎపెక్స్ కౌన్సిల్స్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి హాజరై విజేతలకు ట్రోఫీ అందించారు.

నేడు 'జగనన్నకు చెబుదాం' రద్దు

మహారాణిపేట/దాబాగార్డెన్స్ : కలెక్టరేట్, జీవీఎంసీలో సోమవారం నిర్వహించాల్సిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని రద్దు చేశారు. గిరి ప్రదక్షిణ సందర్భంగా అధికారులంతా ఏర్పాట్లలో నిమగ్నమై ఉంటారని, ప్రజలు కూడా గిరిప్రదక్షిణలో పాల్గొంటున్న నేపథ్యంలో రద్దు చేసినట్టు కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ వేర్వేరుగా ప్రకటనల్లో పేర్కొన్నారు.

నేడు ఎస్సీ కమిషన్ జాతీయ సభ్యుడు రాక

మహారాణిపేట: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు పి. సుభాష్ సోమవారం విశాఖ వస్తున్నారు. మధ్యాహ్నం 1.05 గంటలకు విమానంలో విశాఖ చేరుకుంటారు. హిందుస్థాన్ షిప్‌యార్డులో ఎస్సీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సమావేశంలో ఆయన పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో జరిగే సమావేశంలో పాల్గొంటారు. రాత్రికి విశాఖలో బస చేస్తారు. మంగళవారం ఉదయం పది గంటలకు డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎస్సీ ఉద్యోగులు, అసోసియేషన్ సమావేశంలో ఆయన పాల్గొంటారు. సాయంత్రం 5.45 గంటలకు విమానంలో ఢిల్లీ వెళతారు.

సింహగిరి.. భక్తఝరి

- గిరిప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు
- భక్తులతో కిక్కిరిసిన 32 కి.మీ మార్గం

విరులు పులకించాయి. ఝరులు స్వాగతించాయి. గిరులు ఉప్పొంగిపోయాయి. అడుగులో అడుగేస్తూ అప్పన్నను తలుస్తూ ముందుకు సాగింది భక్తజనం. అన్నిదారులూ సింహగిరివైపే.. అందరి నోటా గోవింద నామ స్మరణే.. స్వామి తలపుతో గిరియాత్ర సాగిపోయింది. సింహగిరీశా పాహిమాం..రక్షమాం.. అంటూ భక్తజనం వేడుకుంది. స్వామే నడిపిస్తున్నారనే భావనతో అలవోకగా ప్రదక్షిణలో నిమగ్నమైంది. భక్తిభావం ఉప్పొంగింది. ఎటు చూసినా ఉత్సాహం.. గిరి ప్రదక్షిణోత్సాహం..



నారసింహా.. గోవిందా గోవిందా : రథోత్సవంలో ఉప్పొంగిన భక్తిభావం



కొబ్బరికాయ కొట్టి ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ

సింహాచలం: ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం సింహగిరి ప్రదక్షిణ ఘనంగా జరిగింది. 32 కిలోమీటర్ల ప్రదక్షిణలో ఈ ఏడాది లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. గిరి ప్రదక్షిణ చేసేందుకు ఉదయం 5 గంటల నుంచే సింహాచలానికి భక్తులు చేరుకున్నారు. రాత్రి 11 వరకు ప్రదక్షిణ చేసేందుకు భక్తులు సింహాచలం తరలివస్తూనే ఉన్నారు. ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఈ ఏడాది



కోలాటం ఆడుతున్న కళాకారులు

అధిక సంఖ్యలో భక్తులు ప్రదక్షిణకు తరలివచ్చారు. పెద్ద ఎత్తున మహిళలు, యువత గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు.

తొలిపావంచా వద్ద ప్రారంభం

ఆదివారం మధ్యాహ్నం 2.40 గంటలకు తొలిపావంచా వద్ద దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ జెండా ఊపి రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు తొలిపావంచా వద్ద శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మొక్కుకొని కొబ్బరికాయలు కొట్టి.. స్వామి నామస్మరణ చేస్తూ రథాన్ని అనుసరించారు. తొలిపావంచా నుంచి ప్రారంభమైన గిరి ప్రదక్షిణ అడవివరం జంక్షన్, పైనాపిల్ కాలనీ, ముడసర్లోవ, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, అప్పుఘర్, వెంకోజీపాలెం, హెచ్‌బికాలనీ, సీతమ్మధార, బాలయ్యశాస్త్రి లేఅవుట్, పోర్టు స్టేడియం, నరసింహనగర్, డీఎల్‌బీ క్వార్టర్స్, సీఐఎస్ఎఫ్ బ్యారెక్స్, ఎన్‌జీవో కాలనీ, మురళీనగర్, మాధవధార, ఆర్అండ్‌బీ కార్యాలయం, కుమారి కల్యాణమండపం, ప్రహ్లాదపురం, శ్రీనివాసనగర్, పాతగోశాల మీదుగా సింహాచలం వరకు జరిగింది. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్,ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు రథంలో



ఉత్సాహంగా ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

ఉన్న స్వామికి పూజలు నిర్వహించారు. కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, దేవదాయశాఖ ఏసీ శిరీషా రథయాత్రలో పాల్గొన్నారు

అప్పుఘర్‌లో సముద్ర స్నానాలు

గిరి ప్రదక్షిణలో పాల్గొన్న పలువురు భక్తులు నగరంలోని అప్పుఘర్ ప్రాంతంలో సముద్ర స్నానాలు ఆచరించారు. అలాగే మార్గంమధ్యలో ఉన్న మాధవధారలోని మాధవ స్వామి ఆలయం వద్ద కూడా స్నానాలు ఆచరించారు. మాధవ స్వామిని దర్శించుకున్నారు.



గొడుగులు వేసుకుని ప్రదక్షిణ చేస్తూ..

అలరించిన జానపదం

రథోత్సవంలో దేవస్థానం ఏర్పాటుచేసిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కాంతార డ్యాన్స్, పులివేషాలు, కాళీ నృత్యాలు, తప్పెటగుళ్లు, డప్పు వాయిద్యాలు అలరించాయి.

విశేషంగా ఏర్పాట్లు

గిరి ప్రదక్షిణని పురస్కరించుకుని కలెక్టర్ మల్లికార్జున ఆధ్వర్యంలో అన్ని శాఖల సమన్వయంతో విశేషంగా ఏర్పాట్లు చేశారు. 32 కిలోమీటర్లు గిరి ప్రదక్షిణ జరిగే కొండచుట్టూ 29 ప్రదేశాల్లో విశ్రాంతి శిబిరాలు ఏర్పాటు చేశారు. శిబిరాల్లో జీవీఎంసీ మంచినీటిని విరివిగా అందించింది. దారిపొడవునా 11 ప్రదేశాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేశారు. పలు ప్రైవేటు హాస్పిటల్స్ శిబిరాలు ఏర్పాటు చేసి భక్తులకు వైద్య సేవలు అందించాయి. నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్‌వర్మ సారథ్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దారిపొడవునా 50కిపైగా స్వచ్ఛంద సంస్థలు భక్తులకు ఆహార పదార్థాలు, మజ్జిగ, శీతల పానీయాలు అందజేశాయి.



తొలిపావంచా వద్ద కొబ్బరికాయలు కొట్టేముందు స్వామికి నమస్కరిస్తున్న భక్తులు



అప్పుఘర్ వద్ద సముద్రంలో భక్తుల స్నానాలు



ప్రచారరథం వద్ద కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



కాంతార వేషధారణ



తొలిపావంచా వద్ద కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు

ప్రదక్షిణలో పదనిసలు

- గిరి ప్రదక్షిణకు ఉదయం 5 గంటల నుంచే భక్తులు సింహాచలం చేరుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి భక్తుల సంఖ్య పెరుగుతూ రాగా మధ్యాహ్నం సమయానికి విపరీతంగా రద్దీ నెలకొంది. సాయంత్రం వర్షం కురవడంతో చెప్పులు లేకుండా నడిచేందుకు భక్తులు ఆసక్తి చూపారు.
- ఉదయమే గిరిప్రదక్షిణ ప్రారంభించి సాయంత్రానికి తిరిగి సింహాచలం చేరుకున్న భక్తులకు రాత్రి 10 గంటల వరకు దర్శనాలు కల్పించారు.
- తొలిపావంచా వద్ద కొబ్బరికాయలు కొట్టే భక్తుల రద్దీని నియంత్రించేందుకు ఈఏడాది 39 క్యూలను ఏర్పాటు చేశారు. అలాగే కొబ్బరికాయలు కొట్టేందుకు వీలుగా ఏర్పాటు చేశారు.
- ఈసారి రెండో ఘాట్‌రోడ్డు వద్ద స్వామివారి నమూనా ఆలయం ఏర్పాటు చేసినా భక్తులెవరూ అక్కడ కొబ్బరికాయలు కొట్టేందుకు వెళ్లలేదు. సంప్రదాయంగా వస్తున్న పాత పద్ధతినే పాటించి తొలిపావంచా వద్దనే కొబ్బరికాయకొట్టి ప్రదక్షిణ ప్రారంభించారు.
- తొలిపావంచా వద్ద కొబ్బరి చెక్కలను ఎప్పటికప్పుడు తరలించేందుకు క్రేనులు, పెద్ద సంఖ్యలో లారీలు ఏర్పాటు చేశారు.
- నగరం నుంచి పాత గోశాలవైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను ఉదయం నుంచే గోశాల జంక్షన్‌కి సమీపంలో నిలిపివేశారు. అక్కడి నుంచి తొలిపావంచాకి భక్తులు కాలినడకనే వెళ్లారు. సాయంత్రానికి గోపాలపట్నం నుంచి సింహాచలం వరకు, వేపగుంట నుంచి సింహాచలం వరకు కూడా పెద్ద సంఖ్యలో భక్తులు నడిచి వచ్చారు. ఈ రెండు మార్గాల్లోను ఇసుకేస్తే రాలనంతంగా రద్దీ నెలకొంది.
- హనుమంతువాక వైపు నుంచి భక్తులు కాలినడకనే గాంధీనగర్, వరాహ పుష్కరిణి, రాజవీధి మీదుగా తొలిపావంచా చేరుకున్నారు.
- అటు పాత గోశాల జంక్షన్, ఇటు అడవివరం జంక్షన్‌ల నుంచి వచ్చే భక్తుల వాహనాలను అడవివరం మెయిన్‌రోడ్డులోకి అనుమతించలేదు. సింహపురి కాలనీ వైపు ఉన్న బీఆర్‌టీఎస్ రోడ్డు, పాత అడవివరం వైపు పార్క్ చేసుకుని వెళ్లేలా ఏర్పాట్లుచేశారు.
- పాత గోశాలవైపు నుంచి ప్రదక్షిణ చేసేందుకు వచ్చే భక్తులను పైడితల్లి అమ్మవారి ఆలయం నుంచి రోడ్డుకు ఎడమవైపున ఉన్న మార్గంలో కంపార్ట్‌మెంట్‌లుగా ఏర్పాటు చేసి రద్దీకి అనుగుణంగా కొబ్బరికాయలు కొట్టేందుకు పోలీసులు పంపించారు.

సౌకర్యాలు అద్భుతం



మేమంతా కాకినాడ జిల్లా అన్నవరం దగ్గర హంసవరం నుంచి గిరిప్రదక్షిణకు వచ్చాం. ఈ ఏడాది గిరిప్రదక్షిణకు చేసిన ఏర్పాట్లు, సౌకర్యాలు చాలా బాగున్నాయి. భక్తులకు ఏమాత్రం ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

– కుమారి, దుర్గా, కుమారి, అన్నవరం

ప్రత్యేకంగా అనిపించింది..



చాలా ఏళ్లగా మేమంతా గిరిప్రదక్షిణకు వస్తున్నాం. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదు. పోలీసులు, ఉద్యోగులు అవసరమైన సమాచారాన్ని తెలియజేశారు.

– ఆధ్యా, కావ్య, శ్రావణి, గాజువాక

12వ సారి ప్రదక్షిణ చేస్తున్నాం



మాలో కొంతమంది 12వ సారి గిరి ప్రదక్షిణలో పాల్గొన్నాం. గిరి ప్రదక్షిణ చాలా ప్రత్యేకమైనది. అందుకే దూరమైనప్పటికి క్రమం తప్పకుండా పాల్గొంటున్నాం.

– కనకరాజు, నవీన్, శశి, వెంకటేష్, సందీప్, విజయనగరం జిల్లా

కోర్కెలు తీర్చే స్వామి



దేశంలోని శక్తివంతమైన పుణ్యక్షేత్రాల్లో శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి పుణ్యక్షేత్రం ఒకటి. స్వామి సన్నిధిలో ఏదీ కోరుకున్నా నెరవేరుతుంది. ఏటా గిరిప్రదక్షిణకు రావడం ఆనవాయితీగా మారింది.

– నాగమణి, రమా పద్మజ, రాజమండ్రి

తొలిసారి పాల్గొన్నాం



గిరిప్రదక్షిణలో పాల్గోవడం తొలి సారి. జనసందోహం చూస్తే నిజంగా ఆశ్చర్యం కలిగింది. చాలా దూరంతో కూడుకున్న ప్రయాణం అయినప్పటికీ భక్తుల కోలాహలంతో చాలా సులభంగా సాగింది.

– రాజేష్, ధనలక్ష్మి, శ్రీకాకుళం

ఇంటింటికీ పైప్‌లైన్ గ్యాస్

- నవంబర్ నాటికి పనులు పూర్తి చేయనున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్
- పారాదీప్–హైదరాబాద్ మధ్య 1.212 కిమీ మేర రూ.3338 కోట్లతో పైప్‌లైన్
- ఈ ప్రాజెక్టులో భాగంగా 723 కి.మీ. మేర ఏపీలో పైప్‌లైన్
- తొలివిడతలో గాజువాకలోని 16 వేల ఇళ్లకు సరఫరా

సాక్షి, విశాఖపట్నం : ఇంట్లో గ్యాస్ అయిపోయింది.. సుశీల కంగారు పడిపోయింది. ఆయనేమో ఆఫీస్‌కు వెళ్లిపోయారు. ఇంకో గ్యాస్ సిలెండర్ కూడా లేదు.. వంట మధ్యలో ఆగిపోయింది. పిల్లలకు బాక్స్ తీసుకెళ్లి ఇవ్వాలి. బుక్ చేసినా.. వెంటనే వచ్చే అవకాశం లేదు. ఆ క్షణంలో సుశీల పడిన టెన్షన్ అంతా ఇంతా కాదు. ఇది కేవలం సుశీలకే కాదు.. గ్యాస్ వినియోగిస్తున్న వారిలో చాలా మందికి ఎదురైన అనుభవమే.

ఇక అలాంటి సమస్య ఉండదు.. సిలెండర్ కోసం ఎదురు చూడాల్సిన అవసరం లేదు. ఒక్క కనెక్షన్‌తో నిరంతరం గ్యాస్ సరఫరా అందుబాటులోకి వస్తోంది. అదే పైప్‌లైన్ ద్వారా ఇంటింటికీ గ్యాస్ అందించే ప్రాజెక్టు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ప్రాజెక్టు ఈ ఏడాది డిసెంబర్ నాటికల్లా గాజువాక ఏరియాలో మొదటి విడతలో అందుబాటులోకి రానుంది.

ఇది కొత్త ప్రాజెక్టా..?

ఈ పైప్‌లైన్ గ్యాస్ ప్రాజెక్టు కొత్త కాదు.. మహరాష్ట్ర



పీహెచ్‌పీఎల్ ప్రాజెక్టు పనులు

వంటి రాష్ట్రాల్లో ఇప్పటికే విజయవంతంగా అమలవుతోంది. పలు నగరాల్లో ప్రైవేట్ గ్యాస్ ఏజెన్సీలు కూడా ప్రభుత్వాల భాగస్వామ్యంతో పైప్‌లైన్ ద్వారా ఇంటింటికీ గ్యాస్‌ను అందిస్తున్నాయి. అలాంటిదే ఇప్పుడు విశాఖ నగరంలోనూ ప్రారంభం కానుంది.

ఎవరు నిర్మిస్తున్నారంటే..

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) ఈ ప్రాజెక్టు చేపడుతున్నారు. ఇటీవల విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రాష్ట్ర ప్రభుత్వంతోనూ ఐవోసీఎల్ ఒప్పందం చేసుకుంది.

పైప్‌లైన్ ప్రాజెక్టు ఖరీదెంత ?

పారాదీప్ నుంచి హైదరాబాద్ పైప్‌లైన్ (పీహెచ్‌పీఎల్) ప్రాజెక్టు పేరుతో ఐవోసీఎల్ దీన్ని ప్రారంభిస్తోంది. 3 రాష్ట్రాలు, 16 జిల్లాలను కలుపుతూ 1,212 కిలోమీటర్ల పొడవునా పైప్‌లైన్ నిర్మిస్తున్నారు.తెలుగు రాష్ట్రాల మీదుగా ఈ పైప్‌లైన్ వెళ్తోంది. మొత్తం రూ.3,338 కోట్లు వ్యయంతో ప్రాజెక్టు నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. మన రాష్ట్రంలో 723 కిమీ మేర పైప్‌లైన్ పనులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే విజయవాడ వరకూ పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టును వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయనున్నారు.

విశాఖలో ఎక్కడ సరఫరా చేస్తారు?

విశాఖలో ఇంటింటికీ పైప్‌లైన్ ద్వారా గ్యాస్‌ను సరఫరా చేస్తారు. తొలి విడతగా గాజువాక ప్రాంతంలోని 16 వేల ఇళ్లకు సరిపడా గ్యాస్‌ను సరఫరా చేసే సామర్థ్యంతో నిర్మాణ పనులు పూర్తి చేశారు. టెక్నికల్ పనులు కూడా చురుగ్గా సాగుతున్నాయి. ఈ ఏడాది నవంబర్‌కి పనులు పూర్తి చేసి డిసెంబర్ నుంచి గాజువాకలో ఇంటింటికీ సరఫరా చేసేలా ఐవోసీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

వినియోగదారులకు ఉపయోగముంటుందా.?

ఈ పైప్‌లైన్ గ్యాస్ సరఫరా ద్వారా వినియోగదారులకు బోలెడు లాభాలున్నాయి. ప్రస్తుత సిలెండర్‌కు అవుతున్న ఖర్చు కొంత మేర తగ్గుతుంది. నిరంతరం గ్యాస్ అందుబాటులో ఉంటుంది. మన వాడకం ప్రకారం బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా సరఫరా మొత్తం పైప్‌లైన్ సిస్టమ్‌లోనే సాగుతుంది. కాబట్టి ప్రత్యేకించి స్టోరేజ్ అవసరం ఉండదు. సురక్షితమైన వాతావరణంలో సరఫరా జరుగుతుంది.

ఎలా సరఫరా చేస్తారు..?

పైప్‌లైన్ ద్వారా ఒక కిచెన్ పాయింట్ అందిస్తారు. అవసరాన్ని బట్టి ఓ అదనపు పాయింట్‌ను కూడా అదే కిచెన్‌లో తీసుకోవచ్చు. మంచినీటిని పంపు నుంచి తిప్పితే నీరు వచ్చినట్లే మనకు అవసరం అనుకున్నప్పుడు గ్యాస్‌ను వాడుకోవచ్చు. వినియోగించిన ఇంధనాన్ని లెక్కించేందుకు ప్రత్యేకంగా పైప్‌లైన్‌కు మీటర్ ఏర్పాటు చేస్తారు. మనం వాడుకున్న ఇంధనానికి అనుగుణంగానే కరెంట్‌బిల్లు మాదిరిగా బిల్ చెల్లించాల్సి ఉంటుంది. కరెంట్‌బిల్లుకి యూనిట్లు మారే కొద్దీ శ్లాబ్ పెరుగుతుంటుంది. కానీ ఈ గ్యాస్‌ను ఎంత వినియోగించినా ఫిక్స్‌డ్ శ్లాబ్ ధరని నిర్ణయిస్తారు. ఇలా పైప్‌లైన్ ద్వారా మనకు సరఫరా అందనుంది. ఈ సౌకర్యం త్వరలోనే అందుబాటులోకి రానుండటం విశేషం.



ఇంటికి సరఫరా అందించనున్నారిలా

24 గంటలూ అందుబాటులో..



విశాఖ ప్రజలకు పైప్‌లైన్ ద్వారా 24 గంటలూ గ్యాస్‌ను అందించే ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకొస్తున్నాం. ఈ పైప్ లైన్ గ్యాస్ వినియోగదారులకు నిరంతర సేవలు అందించేందుకు ఒక కంట్రోల్ రూమ్ చేస్తాం. ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ పూర్తయినప్పటి నుంచి 24 గంటలూ వినియోగదారుడికి అందుబాటులో సేవలందించేందుకు సిబ్బంది ఉంటారు. ఏ ఇంటిదగ్గర చిన్న లీక్ జరిగినా.. సెకన్ల వ్యవధిలో కంట్రోల్‌రూమ్‌కు సమాచారం చేరుకుంటుంది. వెంటనే ఆ ఇంటికి సరఫరాను నిలిపివేసే ప్రక్రియ కేవలం 10 నుంచి 15 సెకన్లలోపే జరిగిపోతుంది. గంటల వ్యవధిలోనే సమస్య పరిష్కరించి .. సరఫరా పునరుద్ధరించేలా వ్యవస్థను రూపొందిస్తున్నాం. 16 ఇంచ్‌ల పైప్‌లను భూగర్భంలో అమర్చాం. దాని ద్వారా సరఫరా చేస్తాం. పైప్‌లైన్ పొడవునా ప్రతి 15 నుంచి 20 కి.మీ దూరంలో సెక్షన్ వాల్వ్ స్టేషన్లను కూడా ఏర్పాటు చేస్తున్నాం.

– అనిల్‌కుమార్, ఏపీ, తెలంగాణ ఐవోసీ ఈడీ

55 మంది ఎంఈవోలకు పోస్టింగ్

మధురవాడ : విశాఖ జోన్–1 పరిధిలోని ఉమ్మడి విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో వివిధ మండలాలకు విద్యాశాఖ అధికారులు–1లను నియమిస్తూ ఆర్‌జేడీ జ్యోతికుమారి ఆదివారం ఉత్తర్వులు ఇచ్చారు. మధురవాడ విద్యాశాఖ ప్రాంతీయ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న గ్రేడ్ – 2 ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎన్నో ఏళ్లుగా ప్రమోషన్ల కోసం ఎదురు చూస్తున్న ప్రధానోపాధ్యాయులకు పదోన్నతి కల్పించడంతో వారి కల సాకారమైనందుకు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో 38 మండలాలు ఉండగా 16 పోస్టులు, విజయనగరంలో 34 మండలాలు ఉండగా 17 పోస్టులు, విశాఖ జిల్లాలో 46 మండలాలు ఉండగా 41 ఖాళీలు ఉన్నాయి. మొత్తంగా మూడు జిల్లాల్లో 118 మండలాలు ఉండగా 74 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ 74 పోస్టులకు గ్రేడు–2 హెచ్‌ఎంలతో సీనియార్టీ జాబితా తయారు చేశారు. వీరిలో 71 మంది కౌన్సెలింగ్‌కి హాజరయ్యారు. 55 మంది పదోన్నతి కోరుకోగా మిగిలిన వారు పదోన్నతి వద్దనుకున్నారు. ఇంకా ఈ జిల్లాల్లో 19 పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నట్టు ఆర్‌జేడీ ఎం.జ్యోతి కుమారి చెప్పారు.

మద్యం మత్తులో కారు బీభత్సం

- వెనుక నుంచి రెండు ద్విచక్రవాహనాలను ఢీకొన్న కారు
- ఇద్దరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు
- తెలుగుతల్లి ఫ్లైఓవర్‌పై ఘటన


గొరుసు యశ్వంత్ ఫైల్

అల్లిపురం: మద్యం మత్తులో అతివేగంగా కారు నడిపిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి నిర్లక్ష్యానికి రెండు నిండు ప్రాణాలు బలికావడంతోపాటు మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. అతడి పరిస్థితి కూడా విషమంగా ఉంది. ఈ ఘటన ఆర్టీసీ కాంప్లెక్స్ దరి తెలుగుతల్లి ఫ్లైఓవర్‌పై శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అల్లిపురం దేవాంగలవీధికి చెందిన గొరుసు యశ్వంత్ శివదుర్గారెడ్డి (17) తన స్నేహితుడు హరికుమార్‌తో కలిసి శనివారం రాత్రి 9.30 గంటల సమయంలో తెలుగుతల్లి ఫ్లైఓవర్‌పైగా పెదవాల్తేరు నుంచి స్కూటీపై బయలుదేరాడు. అదే సమయంలో బైక్‌పై భాను జయరామకృష్ణ (45) తన పెదనాన్న మాధవరావును రైల్వేస్టేషన్‌లో దించేందుకు వెళ్తున్నాడు. ఆ సమయంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి అయిన బర్మాకాలనీకి చెందిన పాకాని సర్వాక్ తన స్నేహితులతో ఓ హోటల్‌లో పార్టీ చేసుకొని తన కారులో బయలుదేరాడు. ఫ్లైఓవర్‌పై నుంచి రైల్వేస్టేషన్ వైపు వెళ్తున్న సర్వాక్ ఆర్టీసీ కాంప్లెక్స్ దరి లలితా జ్యూయలర్స్ వద్ద ముందు వెళ్తున్న యశ్వంత్ అతని స్నేహితుడు హరికుమార్ ద్విచక్ర వాహనాన్ని, భాను జయరామకృష్ణ ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొన్నాడు. దీంతో యశ్వంత్ ఫ్లైఓవర్ పై నుంచి కిందకి పడిపోయి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. అతని స్నేహితుడు హరికుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. జయరామకృష్ణ కూడా తీవ్రంగా గాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని జయరామకృష్ణను, యశ్వంత్‌ను హాస్పటల్‌కు తరలించారు. జయరామకృష్ణ మార్గంమధ్యలో మృతి చెందగా, యశ్వంత్ చికిత్స పొందుతూ తెల్లవారుజామున 3 గంటల సమయంలో మృతి చెందాడు. హరికుమార్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన పాకాని సర్వాక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడు మద్యం ఎక్కువగా సేవించి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అతనికి అన్ని రకాల పరీక్షలు నిర్వహించనున్నట్లు సీఐ బి.తిరుమలరావు తెలిపారు. కాగా జయరామకృష్ణ డెటాల్ కంపెనీలో సేల్స్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవలే విజయవాడ నుంచి విశాఖపట్నానికి బదిలీపై వచ్చాడు.

యశ్వంత్ ఇంటి వద్ద విషాదఛాయలు

పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. మృతుల్లో ఒకరైన గొరుసు యశ్వంత్ బీవీకే కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. విషయం తెలుసుకున్న అతని స్నేహితులు పెద్ద ఎత్తున అల్లిపురం చేరుకున్నారు. యశ్వంత్ తండ్రి స్పీకర్లు రిపేరు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. చేతికి అందివచ్చిన కుమారుడు మృతితో తల్లిదండ్రులు, సోదరుడు గుండెలవిసేలా రోదిస్తున్నారు. సాయంత్రం అతని అంత్యక్రియలు చావులమదుం శ్మశానవాటికలో నిర్వహించారు.

బంధువులకు మృతదేహాల అప్పగింత

మహారాణిపేట : అచ్యుతాపురం సాహితీ ఫార్మా ప్రమాదంలో మరణించిన ఇద్దరు కార్మికుల మృతదేహాలకు ఆదివారం పోస్టుమార్టం జరిగింది. పరిశ్రమలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో పైలా సత్తిబాబు, ఉప్పాడ తిరుపతి మృతి చెందగా, మరో ఐదుగురు గాయపడిన సంగతి విదితమే. పోలీసుల నుంచి పంచనామా నివేదిక రావడంతో ఆదివారం వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రస్తుతం కేజీహెచ్ సీఎస్ఆర్ బ్లాక్‌లో నూకనాయుడు చికిత్స పొందుతున్నట్టు సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు.

మరొక కార్మికుడి మృతి

తీవ్రంగా గాయపడి ఇండస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుల్లో ఆదివారం సమ్మెంగి అప్పారావు మృతి చెందాడు. బియ్యు రామేశ్వర్, సాగిరెడ్డి రాజబాబు, సంతోష్ చికిత్స పొందుతున్నారు.


సీతమ్మధార మీదుగా గిరిప్రదక్షిణలో భక్తులు


పులి వేషధారణలో సందడి


శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

జీవీఎంసీ సేవలు సూపర్


బీచ్‌లో భక్తులకు పోలీసుల సాయం


లుంబినీ పార్కు వద్ద ఏర్పాటు చేసిన నీటి సౌకర్యం


భక్తులకు వైద్య సేవలు

డాబాగార్డెన్స్: వరహాలక్ష్మి నృసింహస్వామి గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులకు జీవీఎంసీ సేవలందించింది. గిరి ప్రదక్షిణ దారి పొడవునా సుమారు 100 పాయింట్లలో తాగునీరు ఏర్పాటు చేసింది. ఎక్కడికక్కడ చెత్తాచెదారాలు పేరుకుపోకుండా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసింది. పిల్లలు తప్పి పోకుండా జీవీఎంసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. పలు చోట్ల వైద్య శిబిరాలు నిర్వహించింది. మొబైల్ టాయ్‌లెట్లతో పాటు టెంపరరీ టాయిలెట్లు ఏర్పాటు చేసింది. లుంబిని పార్కు వద్ద సముద్ర స్నానమాచరించిన భక్తులు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేశారు.

విద్యుత్ వెలుగులు..

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు జీవీఎంసీ ఎలక్ట్రికల్ విభాగం ఆధ్వర్యంలో ఎక్కడికెక్కడ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. గిరి ప్రదక్షిణ దారి పొడవునా 32 కిలోమీటర్ల మేరలో చీకటిగా ఉన్న ప్రాంతాల్లో (గిరి భక్తుల నడక మార్గంలో) విద్యుత్ దీపాలు వెలగించారు. ముఖ్యంగా లుంబిని పార్క్ బీచ్‌లో పెద్ద ఎత్తున ఎల్ఈడీ బల్బులు, ఫోకస్ లైట్లు, ట్యూబ్ లైట్లు ఏర్పాటు చేశారు. సీతమ్మధార, కైలాసపురం, ఎన్జీవోస్ కాలనీ, మురళీనగర్, ఎస్ఎస్‌టీఎల్ రోడ్డు, పాత గోశాల, అడవివరం ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.

ఏర్పాట్లు భేష్



గిరి ప్రదక్షిణలో భక్తులు ఇబ్బంది చేసిన ఏర్పాట్లు బాగున్నాయి. తాగునీరు, టాయిలెట్లు ఏర్పాటు చేశారు. మహిళలు సముద్ర స్నానమాచరించి దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాట్లూ చేశారు.

– నారాయణమ్మ, చీడికాడ

ఎక్కడికక్కడే వైద్య శిబిరాలు



గిరి ప్రదక్షిణలో పాల్గొనడం ఇది తొమ్మిదోసారి. గతంలో కన్నా ఈ ఏడాది సౌకర్యాలు బాగున్నాయి. మంచినీటి సౌకర్యం, విద్యుత్ దీపాలు, వైద్య శిబిరాల ఏర్పాటు బాగున్నాయి.

– నిద్ర సరోజిని, కొన్నేరుపాలెం, అనకాపల్లి జిల్లా

గిరిప్రదక్షిణ కోసం 72 కి.మీ.నడక


గిరి ప్రదక్షిణలో పాల్గొన్న యువత

డాబాగార్డెన్స్: దాదాపు 72 కిలోమీటర్లు నడచి.. వరహా లక్ష్మీనృసింహస్వామి గిరి ప్రదక్షిణలో పలువురు యువకులు పాల్గొన్నారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం, నారువ పంచాయతీకి చెందిన సీహెచ్ రామసూరి, ఎస్.రామకృష్ణ, ఎ.రామిరెడ్డి, శరగడం మోహన్, రమేష్, పి.గోవింద్ శుక్రవారం ఉదయం అక్కడ నుంచి పాదయాత్రగా శనివారం సాయంత్రం 5 గంటలకు సింహాచలం వరహాలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి చేరుకున్నారు. దాదాపు 72 కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించిన వీరంతా ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు సింహాచలం దేవస్థానం తొలిపావంచా వద్ద కొబ్బరికాయ కొట్టి గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. సుమారుగా 104 కిలోమీటర్ల మేర వీరంతా నడిచారు.

భక్తులకు పాదసేవ


పాదసేవ చేస్తున్న సత్యసాయి సేవకులు

ఎంవీపీకాలనీ: గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు శ్రీ సత్యసాయి సేవా సంస్థల కార్యకర్తలు పాద సేవ చేశారు. ప్రదక్షిణలో నడిచిన భక్తుల కాళ్లకు ప్రత్యే నూనె రాసి మసాజ్ చేశారు. బీఆర్‌టీఎస్ రోడ్డుతో పాటు పలు చోట్ల ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి భక్తులకు సేవలందించారు. దీంతో పాటు శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు.

టీటీడీ వద్ద హారతి


హారతి అందుకుంటున్న భక్తులు

ఏటా గిరిప్రదక్షిణలో భాగంగా సింహగిరి చుట్టూ ఊరేగే స్వామివారి రథాన్ని ఎంవీపీ కాలనీ మీదుగా తరలిస్తారు. ఇందులో భాగంగా ఎంవీపీ కాలనీలోని తిరుమల తిరుపతి దేవస్థానం కూడలిలో (టీటీడీ కల్యాణ మండపం) రథాన్ని ఆపి స్వామికి పూజలు చేశారు. ఈ పూజల్లో టీటీడీ అధికారులు పాల్గొని ప్రత్యేక హారతి సమర్పించారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ


కమాండ్ కంట్రోల్ ద్వారా గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూస్తామని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. గిరిప్రదక్షిణ మార్గంలో ఆదివారం ఆయన పలు ప్రాంతాలు సందర్శించారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్యంపై దృష్టి సారించామని, ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలు చేస్తున్నామన్నారు. 20 డ్రోన్ల ద్వారా పలు ప్రాంతాల్లో నిఘా పెట్టామన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటైన కమాండ్ కంట్రోల్‌కు ఈ దృశ్యాలన్నీ అనుసంధానమవుతాయని, దీంతో ఎక్కడెక్కడ ఏఏ లోటుపాటులున్నాయో తెలుసుకుంటున్నామన్నారు. వాటిని అధిగమించడంపై పలువురికి సూచనలిస్తున్నామన్నారు. పర్యటనలో అదనపు కమిషనర్ డాక్టర్ వి. సన్యాసిరావు, ప్రధాన ఇంజినీరు వి.కృష్ణంరాజు, టౌన్‌ప్లానింగ్ అధికారి వి.సునీత, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, మంచినీటి సరఫరా విభాగ ఎస్ఈ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో డిజిటల్ వెలుగులు

- ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌పై బోధనకు అంతా సిద్ధం
- ఐఎఫ్‌పీ వినియోగంపై ఉపాధ్యాయులకు నేటి నుంచి శిక్షణ


ఐఎఫ్‌పీపై పాఠ్యాంశం బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. జాతీయ విద్యావిధానం అమలుతో ఇతర రాష్ట్రాల వారితో మన విద్యార్థులు పోటీ పడేలా సన్నద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ), స్మార్ట్ టీవీల ద్వారా పాఠ్యాంశాల బోధనకు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. తొలిదశలో నాడు - నేడు కింద అభివృద్ధి చేసిన విశాఖలో 109, అనకాపల్లిలో 334, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 368 స్కూళ్లను ఎంపిక చేశారు. తరగతుల సంఖ్యకు అనుగుణంగా హైస్కూళ్లకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, ఫ్రీ ప్రైమరీ స్కూళ్లకు స్మార్ట్ టీవీలను సరఫరా చేస్తున్నారు. ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌ను యుద్ధ ప్రాతిపదికన తరగతి గదుల్లో అమర్చుతున్నారు.

తరగతి గదిలోనే విశ్వ వీక్షణం

ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్, స్మార్ట్ టీవీలకు ఇంటర్నెట్‌తో అనుసంధానం చేస్తున్నారు. ఇప్పటి వరకు గ్రీన్ చాక్ బోర్డుపై పాఠ్యాంశాల బోధన జరుగుతుండగా, వాటి స్థానంలో ఐఎఫ్‌పీలను వినియోగించనున్నారు. ఇంటర్నెట్‌తో అనుసంధానమై ఉన్నందున వీటినే టీవీల మాదిరే ఉపయోగించనున్నారు. బైజూస్ కంటెంట్‌తో నిక్షిప్తం చేస్తున్నందున పాఠ్యాంశాలను నేరుగా వీక్షించే అవకాశం ఉంటుంది. విద్యార్థులకు ప్రపంచంలో ఏం జరుగుతుందనేది కళ్ల ముందే కనిపించనుంది.

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ద్వారా పాఠ్యాంశాల బోధన చేపట్టాల్సిన నేపథ్యంలో వీటిని ఎలా వినియోగించాలనే దానిపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు విద్యాశాఖాధికారులు సిద్ధమయ్యారు. సాంకేతికతపై అవగాహన కల్పించాల్సిన నేపథ్యంలో శిక్షణ కోసమని పలు ఇంజినీరింగ్ కాలేజీలను ఎంపిక చేశారు. సోమవారం శిక్షణ తరగతులు ప్రారంభమవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులందరికీ శిక్షణ ఇచ్చేలా కార్యాచరణ సిద్ధం చేశారు. మండలాల వారీగా కేటాయించిన ఇంజినీరింగ్ కాలేజీలకు ఉపాధ్యాయులు హాజరుకావాలి.

శిక్షణకు ఎంపిక చేసిన కాలేజీలు ఇవే

రఘు ఇంజినీరింగ్ కాలేజీ (దాకమర్రి), ఎన్ఎస్ఆర్ఐటీ (నీలకుండీలు), దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అనకాపల్లి), అవంతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (మాకవరపాలెం), రఘు ఇంజినీరింగ్ కాలేజీ (దాకమర్రి), సాయిగణపతి ఇంజినీరింగ్ కాలేజీ (గిడిజాల), విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (దువ్వాడ), విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఫర్ వుమెన్(దువ్వాడ).

జిల్లాల వారీగా తొలిదశలో ఇలా..

జిల్లా	పాఠశాలలు	ఐఎఫ్‌పీ	స్మార్ట్ టీవీలు	శిక్షణకు ఎంపికైన టీచర్లు
విశాఖపట్నం	109	794	146	2,287
అనకాపల్లి	334	1,146	354	5,688
అల్లూరి	368	1,349	205	3,908

సద్వినియోగం చేసుకోవాలి



విద్యా బోధనలో విప్లవాత్మక మార్పులను ప్రభుత్వం తీసుకొస్తోంది. మన విద్యార్థులు జాతీయ స్థాయిలో పోటీ పడాలనేది ప్రభుత్వ సంకల్పం. ఆ దిశగా అమలు చేస్తున్న విద్యా విధానంలో అందరూ భాగస్వాములు కావాలి. ఐఎఫ్‌పీ వినియోగంపై ఇస్తున్న శిక్షణను ఉపాధ్యాయులంతా సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం.జ్యోతికుమారి, ఆర్జేడీ, విశాఖ

శిక్షణకు హాజరుకావాలి



ఉపాధ్యాయులు తప్పనిసరిగా శిక్షణకు హాజరుకావాలి. ఏయే మండలాల వారు ఎక్కడికి రావాలనేది ముందుగానే సమాచారం ఇచ్చాం. పాఠశాలల నిర్వహణకు ఆటంకం లేకుండా బ్యాచ్‌ల వారీగా రావాలి. ఈ విషయంలో ప్రధానోపాధ్యాయులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

– గౌరీ శంకర్, డిప్యూటీ డీఈవో, విశాఖపట్నం

రేపటి నుంచి ఎన్నికల సిబ్బందికి శిక్షణ

మహారాణిపేట: వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి ఎన్నికల జాబితా సవరణకు అధికారులు సిద్ధం కావాలని కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈఆర్‌వోఎస్, ఏఈఆర్‌వోఎస్, బీఎల్‌వోలకు ఎలక్ట్రోరల్ రోల్‌కు సంబంధించి మార్గదర్శకాలపై సూచనలు చేశారు. మంగళ, బుధవారాల్లో సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు గాజువాక, విశాఖ దక్షిణ, పెదగంట్యాడ, సబ్బవరం, మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు భీమిలి, విశాఖ పశ్చిమ, పరవాడకు చెందిన సిబ్బందికి శిక్షణ నిర్వహించనున్నామన్నారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి 12 వరకు విశాఖ తూర్పు, పశ్చిమ, పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల సిబ్బందికి శిక్షణ నిర్వహించనున్నట్టు తెలిపారు.

హోమియో వైద్యుల సర్వసభ్య సమావేశం


హోమియో సృష్టికర్త హనీమాన్ చిత్రం వద్ద నివాళులు అర్పిస్తున్న వైద్యులు

మహారాణిపేట: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజీషియన్స్ విశాఖ జిల్లా శాఖ హోమియో వైద్యుల సర్వసభ్య సమావేశంలో నగరంలో ఒక హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా హోమియో సృష్టికర్త డాక్టర్ శామ్యూల్ హనీమాన్ 180వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు డాక్టర్ రాఘవేంద్ర రావు వైద్యరంగంలో హోమియోకు ప్రముఖ స్థానముందన్నారు. నిరంతర వైద్య.విద్యా కార్యక్రమంలో భాగంగా పిల్లలలో వచ్చే ఆటిజమ్ వ్యాధి - హోమియో వైద్యం అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ సంయుక్త కార్యదర్శి డాక్టర్ జి.రాజేంద్ర ప్రసాద్ , డాక్టర్లు కె.శర్మ, బి.వెంకటేష్, జి.రాధిక , రాజా శ్రీకాంత్, వి.హేమలత, శివకాంతి, యస్.సుధాకర్, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో మరిచిపోయిన బ్యాగ్ అందజేత


బాధితుడికి నగదు బ్యాగ్ అందిస్తున్న పోలీసులు

ఆరిలోవ : కుమార్తెను పరీక్ష నిమిత్తం ఆటోలో కేంద్రానికి తీసుకొచ్చిన సమయంలో నగదుతో కూడిన బ్యాగ్ మరిచిపోయిన బాధితుడికి తిరిగి ఆ బ్యాగ్‌ను ఆరిలోవ పోలీసులు అందజేశారు. తోటగరువు హైస్కూల్‌లో పరీక్ష రాసేందుకు కుమార్తెను ఆటోలో ఆదివారం తీసుకొచ్చిన ఓ వ్యక్తి అందులో రూ.లక్షతో ఉన్న బ్యాగ్‌ను మరిచిపోయి వెళ్లిపోయాడు. తర్వాత చూసుకుని ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేయగా... ఆటోను ట్రేస్ చేసిన పోలీసులు బ్యాగ్‌ను బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్‌ను అభినందిస్తూ వెయ్యి రూపాయల అందజేశారు.

రాయితీపై టమాటా!

- కిలో రూ.50కే రైతుబజార్లలో విక్రయం
- నగరానికి 16 టన్నుల రాక


సీతమ్మధార రైతు బజార్లు వద్ద టామాటాల కోసం బారులుదీరన జనం


ఎంవీపీ రైతు బజార్ స్టాల్‌లో టమాటాలు తూచి ఇస్తున్న జేసీ విశ్వనాథన్

సాక్షి, విశాఖపట్నం: టమాటా ధర కొండెక్కి కూర్చున్న నేపథ్యంలో ప్రభుత్వం వాటిని రాయితీ ధరలకే అందిస్తోంది. ఇందుకోసం రైతుబజార్లలో వీటిని విక్రయిస్తోంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కిలో టమాటా ధర రూ.100 వరకు పలుకుతోంది. అయితే రైతుబజార్లలో వీటిని రూ.50లకే విక్రయించేలా చర్యలు చేపట్టింది. ఆదివారం నగరానికి 16 టన్నుల టమాటాలను రప్పించారు. మార్కెటింగ్ శాఖ అధికారులు వీటిని నగరంలోని ఎంవీపీ, సీతమ్మధార, గోపాలపట్నం రైతుబజార్లలో అందుబాటులో ఉంచారు. మంగళవారం మరో 16 టన్నుల టమాటాలు నగరానికి రానున్నాయి. వీటిని నగరంలోని తెరిచి ఉంచే మర్రిపాలెం, నరసింహనగర్, ఎంవీపీ, స్టీల్‌ప్లాంట్, పెందుర్తి రైతుబజార్లలో రాయితీ టమాటా విక్రయాలు జరుపుతామని మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ యాసిన్ 'సాక్షి'కి చెప్పారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.